క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద ఉన్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అర్చకులు పురాణం శేషాచార్యులు పర్యవేక్షణలో వ్రతం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ్, కలిగొట్ల సూర్యనారాయణ, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.బంగార్రాజు, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతానికి పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

మధురవాడ: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ప్రార్థిస్తూ బీజేపీ నాయకులు మధురవాడ వాంబేకాలనీలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మధురవాడ మండల అధ్యక్షుడు యండ అప్పారావు ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని నాగదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో నాయకులు పూజలు, హోమం నిర్వహించారు. పహల్గాంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడికి ప్రతి స్పందనగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని, భారత సైనికులు, ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులోని మంగమారిపేట ఎర్నిమాంబ అమ్మవారి మారువారం పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి వెళ్లి, అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంగాధరరెడ్డికి ఘన నివాళులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు సబ్బెళ్ల గంగాధరరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా కార్యాలయంలో ఆదివారం ఆయనకు నాయకులు నివాళులు అర్పించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లుతో పాటు నగరంలో పలు ఫ్యాక్టరీలలో ఆయన కార్మిక సంఘాలు స్థాపించి, కార్మికుల శ్రేయస్సుకు పని చేశారని నాయకులు కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో బి.రామారావు, డి.శ్రీను, మునకాల ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి, నీలాపు శంకరరెడ్డి, గొండేల అప్పారావు, గిడిజాల రమణ, డెక్కతి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి



లైఫ్‌గార్డ్స్‌తో మాట్లాడుతున్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తీర ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్, సెక్యూరిటీ గార్డ్స్ అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. రుషికొండ బీచ్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. తీరం వెంబడి అనుమానిత వ్యక్తులు కనిపించినా.. అనుమానంగా బోట్లు పయనించినా వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. రుషికొండ బీచ్‌కు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారని.. జాగరూకతతో వ్యవహరించాలన్నారు.ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.



పీఎం పాలెం ఆఖరు బస్టాప్ నుంచి శంభువానిపాలెం గిరిజన గ్రామంలోకి వెళ్లే రోడ్డు ముఖద్వారం

జీవీఎంసీ పరిధిలో ఏకైక గిరిజన గ్రామం శంభువానిపాలెం. విశాఖ మహానగరంలో నివసిస్తున్నా, మిగిలిన ప్రజల్లా కనీస సౌకర్యాలకు నోచుకోక, సమస్యలతో సహజీవనం చేస్తున్నారు ఈ గ్రామ ప్రజలు. ఆరోవార్డు పరిధి పీఎం పాలెం ఆఖరి బస్టాపునకు సుమారు 5 కి.మీ దూరంలో, కొండ కోనల్లో ఉన్న ప్రాంతం కంబాలకొండ అభయారణ్యం పరిధిలోకి వస్తుంది. ఈ గ్రామానికి వెళ్లేందుకు సరైన బస్సు సదుపాయం లేక, అక్కడ నివసించేందుకు సరైన వసతుల్లేక ఇబ్బంది పడుతున్నారు గ్రామస్తులు. తమ గోడు వినేదెవరంటూ ఆవేదన చెందుతున్నారు.
- పీఎం పాలెం

మహానగరంలో ఉన్నా..
సౌకర్యాలు సున్నా

సమస్యల వలయంలో శంభువానిపాలెం ■ రోజుకు ఒక్కసారి మాత్రమే బస్సు సదుపాయం ■ రహదారులు గోతులమయం
డ్రైనేజీల్లేక క్షీణిస్తున్న పారిశుధ్యం ■ మూన్నాళ్ల ముచ్చటగా విద్యుత్ సౌకర్యం ■ అడవి మార్గంలో కాలినడకనే ప్రయాణం

రోజుకు ఒక్క ట్రిప్పు మాత్రమే..

ఈ గ్రామంలోకి వెళ్లడానికి గతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది కాదు. తుమ్మెరగెడ్డ మలుపు వద్ద ఉన్న కొండ అడ్డుగా ఉండేది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ కొండను కట్ చేసి, ఆర్టీసీ బస్ సదుపాయం కల్పించారు. అప్పట్లో రోజులు నాలుగు ట్రిప్పులు నడవడంతో ప్రజలకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం ఒక్క ట్రిప్పు మాత్రమే ఉదయం 7 నుంచి 8 గంటల నడుమ బస్ సర్వీస్ నడుపుతున్నారు. గ్రామంలో నివసిస్తున్న సుమారు 100 కుటుంబాలు కూలి,నాలి చేసుకునేవారే. పని కోసం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి ఉదయం బస్సు సదుపాయం ఉంది. కానీ రాత్రివేళల్లో లేకపోవడంతో కిలోమీటర్ల దూరం చీకట్లో నడిచి రావలసి వస్తోంది. అడవి ప్రాంతం కావడంతో పురుగు, పుట్ర భయంతో బితుకుబితుకుమంటూ **ప్రయాణిస్తున్నారు. సాయంత్రం** వేళ కూడా ఆర్టీసీ **సౌకర్యం ఏర్పాటు** చేయాలని **కోరుతున్నారు.**



గ్రామంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు

రోడ్డంతా అంధకారమే..



లైట్లు అపహరణకు గురవడంతో మొండిగా మిగిలిన స్తంభాలు, క్లాంప్ బెండ్

గ్రామంలోకి వెళ్లే రోడ్డు పొడవునా ఉన్న విద్యుత్ స్తంభాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. రాత్రిపూట విద్యుత్ దీపాల వెలుగులో హాయిగా ఇళ్లకు చేరుకోవచ్చునని గ్రామస్తులు సంబర పడ్డారు. కానీ, అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. ప్రస్తుతం స్తంభాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల జాడే లేదు. ఆ లైట్లకు గుర్తుగా కేవలం స్తంభాలపై క్లాంప్‌కు బిగించిన వంగిన పైపులు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి.

రెయిలింగ్ లేని వంతెన

రోడ్డు మధ్యలో కాలువపై నిర్మించిన వంతెనకు రెండువైపులా ఏర్పాటు చేసిన రెయిలింగ్ నామరూపాలు లేకుండా పోయింది. ఈ కారణంగా రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన వద్ద ముందు జాగ్రత్త చర్యగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయవలసి ఉంది. త్వరితగతిన రెయిలింగ్ ఏర్పాటు చేయాలి.



రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా రోడ్డుపై వంతెన

గతుకులమయంగా రహదారి

గ్రామంలోకి వెళ్లే రహదారి గతుకులమయంగా మారింది. కనీస మరమ్మతులైనా చేపట్టకపోవడంతో గుంతలు పెద్దవి అయిపోతున్నాయి. దీంతో ఆ గుంతల రోడ్డులోనే ప్రయాణించవలసి వస్తోంది.



గ్రామంలోకి వెళ్లే రోడ్డు ఇలా..

ఎక్కడి మురుగు అక్కడే..

గ్రామంలో డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు పోయే మార్గం లేక గ్రామంలో పారిశుధ్యం క్షీణిస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి కాలువల కారణంగా గ్రామంలో దోమలు బెడద అధికంగా ఉంది. వీటి కారణంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అధికారలు వెంటనే స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



డ్రైనేజీలు నిర్మించకపోవడంతో గ్రామంలో ప్రవహిస్తున్న మురుగునీటి కాలువ

రెండుపూటలా బస్సు నడపాలి



“సరైన రవాణా సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నాం. సాయంత్రమైతే మరీ కష్టంగా ఉంటోంది. చీకట్లో, అడవి మార్గంలో నడిచి రావలసి వస్తోంది. మహిళలు, వృద్ధులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సాయంత్రం కూడా బస్సు నడపాలి.”
-కదరాసి రాజ్యలక్ష్మి, శంభువానిపాలెం

విద్యుత్ లైట్లు పునరుద్ధరించాలి

“పీఎం పాలెం ఆఖరి బస్టాప్ నుంచి గ్రామంలోకి వచ్చే వరకు ఉన్న రోడ్డు చాలా చీకటిగా ఉంటోంది. గతంలో లైట్లు ఉండేవి. ఇప్పుడు స్తంభాలే మిగిలాయి. ఆ రోడ్డులో లైట్లు వెలిగేలా చూడాలి. అలాగే వంతెన వద్ద రెయిలింగ్ లేక చీకట్లో చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారు. రెయిలింగ్ ఏర్పాటు చేయాలి.”



-కె.రమేష్, శంభువానిపాలెం

వైభవంగా నృసింహ జయంతి



రాధా మదనమోహనులకు పూజలు చేస్తున్న నిష్కించిన భక్తదాస



నృసింహ యజ్ఞాన్ని తిలకిస్తున్న భక్తులు

తగరపువలస: నృసింహ జయంతిని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద గల శ్రీరాధా మదన మోహన స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు నృసింహ యజ్ఞం, 10.30 నుంచి 11 వరకు పూర్ణాహుతి, శాంతి వచనం, 11 నుంచి 11.30 వరకు నరసింహ లీలా ప్రవచనం వినిపించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా నృసింహ యజ్ఞం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ నృసింహస్వామి అవతార ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. నృసింహ యజ్ఞం సర్వ దోష నివారిణి అని, ప్రపంచ శాంతి కోసం ఈ యజ్ఞాన్ని నిర్వహించామని చెప్పారు. శ్రీ రాధా మదన మోహనులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. మంగళహారతి అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అంబరీష దాస సహాయ సహకారాలు అందించారు.



ఇస్కాన్‌లో నృసింహ స్వామికి పంచామృతాభిషేకం

ఇస్కాన్ మందిరంలో..

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామివారి దర్శనం, 8 గంటలకు దర్శన హారతి, గురుపూజ, అనంతరం రాధా దామోదరునికి, శ్రీలక్ష్మీ నరసింహస్వామిని ప్రత్యేకంగా వివిధ పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రహ్లాద మహారాజ లీలలు, నరసింహ చతుర్దశి ప్రాముఖ్యతపై ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ప్రవచించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



నృసింహ యజ్ఞం చేస్తున్న వేద పండితులు



స్వామికి పుష్పాభిషేకం

పిల్లల పెంపకంలో తల్లి పాత్ర ఎనలేనిది

భీమునిపట్నం: పిల్లల పెంపకంలో తల్లి పాత్ర ఎనలేనిదని మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమిలి దరి బ్యాంక్ కాలనీ వద్దనున్న బ్లూమింగ్ స్టార్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు ప్రేమను పంచుతూ, వారి అభివృద్ధికి తల్లి అడుగడుగునా బాటలు వేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్న పిల్లలకు తల్లిదండ్రుల గొప్పదనం గురించి చెప్పడమే కాకుండా వారిపట్ల గౌరవమర్యాదలు ఉండేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన తల్లి ప్రేమను తెలిపే నాటిక అందరినీ ఆకట్టుకుంది. రేఖవాని పాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



తల్లి గొప్పదనాన్ని తెలిపే నాటికను ప్రదర్శిస్తున్న పిల్లలు

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ: కార్మికుల హక్కుల పరిరక్షణకు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, రాజశేఖర్ కోరారు. కొమ్మాది జంక్షన్ వద్ద ఆదివారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భవన కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి ప్రభుత్వం తీసుకున్న నిధులు వెంటనే వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఎన్నికల్లో గెలిచిన వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, మాట తప్పారని విమర్శించారు. కార్మిక చట్టాల రక్షణ, ప్రభుత్వ రంగసంస్థల పరిరక్షణ, ప్రభుత్వాలు కార్మిక కుటుంబాలకు ఇవ్వవలసిన పరిహారాలు, వివిధ రకాల క్లెయిమ్‌లు వెంటనే విడుదల చేయడం, తదితర డిమాండ్ల కోసం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో త్రిశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎల్.దుర్గారావు, నాయకులు డి.తిరుపతి రావు, పి.సత్తిబాబు, రామన్న, సత్తిబాబు, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాది జంక్షన్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగివలస చెరువు ప్రక్షాళన పనులు ప్రారంభం



సంగివలస చెరువులో తగ్గిన నీరు



అల్లూరి సీతారామరాజు కాలనీ వైపు మదుమల నుంచి నీటిని వదులుతున్న దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలస చెరువు ప్రక్షాళన పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. ఐదేళ్ల క్రితం చెరువు చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ సమయంలో హైవే వైపు చెరువు ఇన్‌ఫ్లోతో పాటు సంగివలస కాలనీ, వ్యవసాయ భూముల వైపు అవుట్ ఫ్లోలను ఎత్తు చేశారు. దీంతో సంగివలస, వలందపేట, ఇడదాసరిపేట, ఊళ్లపేట తదితర గ్రామాల నుంచి డ్రైనేజీల నీరు చెరువులోకి ప్రవేశించే అవకాశం లేకుండా పోయింది. వర్షాకాలంలో హైవేను ఆనుకుని ఉన్న సర్వీస్‌రోడ్డు మరో చెరువును తలపించేది. మరోవైపు వర్షాల ద్వారా సంగివలస గ్రామం నుంచి ప్రవహించే నీరు చెరువులోకి చేరినా, అవుట్ ఫ్లో లోపాల కారణంగా ఇబ్బందిగా ఉండేది. గత నెల 30న కురిసిన వర్షానికి చెరువు అవుట్ ఫ్లో, ఇన్‌ఫ్లో పని చేయక అప్పటికే చెరువులో ఉన్న చేపలు ఆక్సిజన్ అందక మృత్యువాత పడ్డాయి. ఆ దుర్గంధంతో స్థానికులు, భక్తులు ఇబ్బంది పడటంతో ‘సంగివలస చెరువులో చేపల మృత్యువాత’ శీర్షికతో సాక్షిలో వార్తను ప్రచురితమైంది. దీంతో ఈ నెల ఒకటో తేదీన చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెరువు ప్రక్షాళనకు అధికారులను ఆదేశించారు. పనులు ప్రారంభం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో నుజ్జయిన కారు ముందు భాగం

కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం నగరం నుంచి మధురవాడకు వెళ్తున్న కారుకు ఓ ద్విచక్ర వాహనం అడ్డుగా రావడంతో, దానిని తప్పించబోయి కారు అదుపు తప్పి సెంట్రల్ డివైడర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డివైడర్‌పై ఉన్న ఐరన్ గ్రిల్స్, కారు ముందు భాగం పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రదర్శనలో శ్రీకాకుళానికి చెందిన నటరాజ నాట్యకళా మండలిలో శిక్షణ పొందుతున్న చిన్నారి కళాకారులు తాము అభ్యసించిన నృత్యాంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. మహాగణపతిం భజే గీతానికి ప్రదర్శించిన బృంద నృత్యంతో ప్రారంభమైన కార్యక్రమంలో తారంగం.., రామాయణ శబ్దానికి అభినయించిన నృత్యరీతులు ప్రత్యేకంగా నిలిచాయి. శివతాండవం బృంద నృత్యం మరో ఆకర్షణగా నిలిచింది. అన్నమయ్య సంకీర్తనలకు చిన్నారి కళాకారులు చేసిన నృత్యాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. కార్యక్రమంలో కళాకారులు వాసుదేవ, స్వాతి, స్నేహ, ఇందు, కీర్తి, సింధుజ, శ్రియ, కె.హేమప్రియ, లలితాంబ, అనూష తదితర కళాకారులు పాల్గొన్నారు.



నృత్యప్రదర్శన ఇస్తున్న కళాకారులు

రహదారి.. పార్కింగ్‌కే సరి

పాదచారులు, ద్విచక్ర వాహనచోదకుల అవస్థలు



ప్రైవేట్ మార్కెట్ ముఖద్వారం వద్ద రోడ్‌పై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డుల పరిసర ప్రాంతాల రహదారులు వాహనాల పార్కింగ్ జోన్లుగా మారిపోతున్నాయి. నిత్యం వాహనాల నిలిపివేత కారణంగా కిక్కిరిసి పోతున్నాయి. ఒకవైపు వ్యాపారులు రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను దాటి రహదారిపైకి తమ వ్యాపారాలు విస్తరించారు.. పైగా వారి దుకాణాలకు వచ్చేవారికి కూడా పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై అడ్డదిడ్డంగా పెడుతున్నారు. దీంతో మార్కెట్‌కు నడిచి వచ్చే వారితో పాటు ద్విచక్రవాహనదారులు కూడా ముందుకు కదలలేని పరిస్థితి.

చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

తగరపువలస ప్రైవేట్ మార్కెట్ చుట్టూ రహదారులను వ్యాపారులు ఆక్రమించి దర్జాగా వ్యాపారాలు చేస్తున్నా అభ్యంతరం చెప్పవలసిన టౌన్ ప్లానింగ్ అధికారులు వారి నుంచి కానుకలు తీసుకుని చూడకుండా వెళ్లిపోతున్నారు. దీంతో నిత్యం ఈ మార్గాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతూనే ఉంది. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం సహకారం లేకపోవడంతో ప్రజలే కాకుండా ట్రాఫిక్ పోలీసులు, పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు మొద్దు నిద్ర వీడి తమ బాధ్యతలను చేపట్టాలని భీమిలి పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సంతబయలు రహదారిలో అన్‌లోడింగ్ కోసం నిలిపిన వ్యాన్



చిల్డ్రన్స్ కాన్వెంట్ ఇరుకైన మార్గంలో బడ్డీలు, ద్విచక్రవాహనాలు